యుగాలు గడుస్తున్నా, తరాలు మారుతున్నా.. స్త్రీగతి దుర్గతేనా? ఆచారాలు, సంప్రదాయాల పేరిట వారిని బాధించడం, శ్రమ, లైంగిక దోపిడీలకు పాల్పడడం అన్ని సమాజాల్లోనూ కన్పిస్తున్నదే. పల్లెల నుంచి నగరాల దాకా హింస. బసివిని, మాతంగిని, జోగిని, దేవదాసి, కన్నెరికం.. పేరేదైతేనేం? వనితల బతుకుల్ని ఊరుమ్మడి సొత్తుగా మార్చేయడం... ఇదే కథావస్తువును స్వీకరించి, సమాజాన్ని ఆలోచింపచేసేలా చక్కని నవలని అందించారు డాక్టర్ వి.ఆర్.రాసాని. సుమారు మూడేళ్లక్రితం 2006 డిసెంబరు 'చతుర'లో 'ముద్ర'గా ప్రచురితమైన ఈ నవల పాఠకుల్ని అలరించింది.. కదిలించింది.. ఆలోచింపజేసింది. అంతేకాదు ఏడాది క్రితం 'జోగతి' పేరుతో కన్నడంలోకి అనువదితమై కన్నడిగుల అభిమానాన్నీ చూరగొంది. త్వరలో రెండో ముద్రణకు వెళ్లనుండడం దీనికి నిదర్శనం. రెండు రాష్ట్రాల పాఠకుల్ని ఆకట్టుకోవడమేగాక, ఆలోచింపజేసిన 'ముద్ర' 'కథవెనుక కథ' ఈనెల మీకు ప్రత్యేకం!

కథ వెనుక కథ

వనితల వెతల ముద్ర

రచయిత డాక్టర్ రాసాని చిత్తూరుజిల్లా తిరుపతిలో తెలుగు అధ్యాపకులు. స్వస్థలం సమీపంలోని ఓ మారుమూల పల్లె. రాయలసీమలో బసివిని పేరుతో మోసపోతున్న, మొత్తం జీవితాన్నే కోల్పోతున్న దళిత వనితల హృదయావేదన ఆయనను కదిలించింది. ఆ కష్టనష్టాల్ని అక్షరీకరించాలన్న తపన రగిలించింది. పర్యవసానమే 'ముద్ర'. 2006 డిసెంబరు 'చతుర'లో ప్రచురితమైన ఈ నవలకు పాఠకులతో పాటు విమర్శకులనుంచీ ప్రశంసల జడి. కన్నడిగుల మనసుల మీదా దీని ముద్ర పడింది. గత ఏడాది 'జోగతి' పేరున డాక్టర్ టి.డి. రాజన్న తగ్గి దీన్ని కన్నడంలోకి అనువదించారు. త్వరలోనే ద్వితీయ ముద్రణకు వెళ్తోందని చెబుతున్నారు. ఈ సందర్భంగా మూల రచయిత రాసాని ఏమంటున్నారో వినండి..

'ముద్ర' చతురలో నవలగా రావడానికి ముందే 'అక్షింతలు' పేరిట కథగా, ఆ తర్వాత 'మాత' పేరుతో నాటకంగా రాశా. 'మాత' తిరుపతి ఆకాశవాణి నుంచి ప్రసారమైంది. ఆ తర్వాతే దీన్ని నవలగా రాయాలని అనుకున్నా. అంశమేమో సున్నితం. పీడిత వనితల బతుకు చిత్రానికి అద్దంపట్టేది. పురుషుల దురహంకారాన్ని వేలెత్తిచూపేది. అంటే కరుణతో పాటు కాఠిన్యాన్నీ మేళవించి, యథార్థ జీవిత యదార్థ దృశ్యాన్ని పాఠకుల ఎదుట నిలపాలన్నమాట. సంప్రదాయమంటూ సాగుతున్న అకృత్యాన్ని వెల్లడించడంలో ముందు జాగ్రత్త ప్రధానం. ఇమిడే భావం, వాడే శైలి, రాసే భాష, అంత ర్లీనంగా సాగే హృదయ ఘోష.. అన్నిటా పదును ముఖ్యం. దురంతాల కోరల్లో చిక్కిన స్త్రీల, బాలికల దురవస్థను చూపుతూనే మరోవైపు స్వార్థబుద్ధుల టక్కుటమారాల్ని ఎండగట్టాలి అనుకున్నాను.

కన్నడ నవల 'జోగతి' ముఖచిత్రం

సజీవ, సహజ పాత్రలు

ఎత్తుగడ ఎలా ఉండాలి? పరిస్థితిని వర్ణించాలా? సంభాషణగా చెప్పించాలా?.. ఇలా ఎన్ని ఆలోచనలో! మిత్రుడు మధురాంతకం నరేంద్రతో ఎన్నెన్ని చర్చలో!! ఒకటీ రెండూ కాదు.. మూడేళ్ల మనోమథనం. నవలగా రూపచిత్రణకు ఇంకో మూడేళ్లు. అంతా కలిసి ఆరేళ్ల శ్రమ ఫలితమే ముద్ర! ముసలి ఓబులవ్వ, సాయిబులమ్మి హసీనా సంభాషణలతోనే నవల ఆరంభం. తనకథ చెప్పిన హసీనా తదుపరి కథని నడిపించడం ప్రత్యేక అంశం.

మనసులోనిది కాగితంమీద పెట్టడానికి తపించాను, పరిశ్రమించాను. నాలుగు సార్లు తిరగరాశాను. అప్పటికి వచ్చింది ఆశించిన రూపం.

'ముద్దరేసి వదలడం' రాయలసీమలో బాగా వాడుకలో ఉన్నమాట. బసివి ఆచారాన్ని అడ్డుపెట్టుకుని 'మృగాళ్లు' సాగించే దుష్కృత్యం కాబట్టే 'ముద్ర' పేరు పెట్టాను. నవలలో ఉన్నవి సజీవ పాత్రలే. స్వస్థలం చిత్తూరు జిల్లాలో, పొరుగు రాష్ట్రం తమిళనాడుకి చెందిన కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికీ ఉన్న స్థితిగతులే. చిన్నతనంలో చూసిన, ఆ తర్వాత కాలంలో గమనించిన వ్యక్తుల రీతులనే నవలలో పొందుపరిచా. పులిచెర్ల, కాళహస్తి, చిత్తూరు దగ్గరి కల్లూరు... ఇలా పల్లెల్లోనే కాదు.. తిరుపతి పట్టణం, పరిసరాల్లో కూడా తిరిగి చూశాను. నిజజీవితంలోని పాత్రల్ని నవలలోకి తెచ్చినందుకే ఇంత సహజత్వం. రెండు దశాబ్దాలక్రితమే తిరుపతి స్థానిక టీవీలో 'కన్నెరికం' అనే కార్యక్రమానికి రూపల్పన చేశాను. అదే ఊళ్లలోని మాతమ్మల నివాస ప్రాంతాల తీరుతెన్నుల్ని పరిశీలించాను. నాకు తెలిసినవి, ఇతరులతో మాట్లాడి తెలుసుకున్నవి.. వీటినే నవలలో పొందుపరిచాను. ఆ సజీవ, సహజ పాత్రలు కొన్ని నేటికీ తిరుగాడుతుంటాయి. నా కళ్ల ముందే! రచయితగా నా మదిని కదిపిన పాత్రలు రెండు. కోటమ్మ, అలివేలు. ప్రధా

సంచలనం

మనదేశంలోని అనాచార పద్ధతుల్లో 'జోగిని' ఒకటి. ఆ పూర్వాపరాలు, స్థితిగతుల్ని రాసాని ఎంతో విశ్లేషించి రాశారు. ఇది కన్నడంలో ఓ నూతన కథావస్తువు కావడంతో, అంతటా సంచలనం కలిగించింది. ఆయనని, కన్నడంలో అనువదించి ముద్రించిన వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా.

– మీరా సాబిహళ్లి శివన్న,
బెంగళూరు (ప్రసిద్ధ సాహితీవేత్త)

ప్రయోగాత్మకం

కర్ణాటక సాహిత్యలోకంలో సంచలనం కలిగించిన కాదంబరి (నవల) ఇది. సరికొత్త ప్రయోగాత్మక రచనగా ఎందరో కన్నడిగుల గుండెల్ని తాకింది. ఇందులోని కథనరీతికి చదువరులు స్పందించిన రీతి మాత్రం మాటలకు అందనిది, అపూర్వమైనది కూడా.

– కుం. వీరభద్రప్ప,బళ్లారి
(కన్నడ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత)

నపాత్ర కోటమ్మ రూపుని బాల్యంలోనే చూశాను.

సత్వర స్పందన

చతురలో 'ముద్ర' నవల రావడం, కన్నడంలోకి అనువాదంగా మారడం.. నన్నెంతో ఆనందపరిచిన సందర్భాలు. ఆ తర్వాత తిరుపతి మహతి ఆడిటోరియంలో ఏర్పాటైన చైతన్య సదస్సు. అక్కడ న్యాయమూర్తి ఆధ్వర్యంలో దీన్ని నిర్వహించారు. బసివినులకు పునరావాసం, ఇతర సహాయాలకు కూడా అక్కడే శ్రీకారం చుట్టారు. ఇంతటి స్పందనకి నా రచన కారణమైనందుకు ఇంకా ఇంకా ఆనందం.

రాసాని

కథాంశమిదీ..

ఊరిచివర దళితవాడలో బసివిని గుడిసె.. వృద్ధ యాచకురాలు ఓబులవ్వ నివాసం. అటువైపు ఎవ్వరూ రాకపోవడానికి కారణముంది. ఊళ్లోని మాతమ్మ ఆచారానికి ఎందరో ఆడపిల్లలు బలైంది అక్కడే. ఆమెకూడా ఒకప్పుడు బసివినిగా ముద్రపడి చివరికలా అనాథగా మారింది. ఓ అర్ధరాత్రి గుడిసెలోకి వచ్చిన హసీనా.. అక్కడే నాలుగు రోజులు ఉంటానంటుంది. అవ్వకు వంద రూపాయలిస్తుంది. కేవలం నాలుగు రోజుల వ్యవధిలో కథంతా పూర్తి. సారాంశమంతా ఆ యిద్దరు స్త్రీలూ మాట్లాడుకోవడంలోనే ఉంటుంది. హసీనా ఎవరనేది నవల చివరిదాకా సస్పెన్స్!

ఆమె పూర్వపు పేరే కోటమ్మ. తనూ దురాచార సర్పదష్టురాలే. తనకు లొంగడం లేదని ఊరి సర్పంచి ముసలయ్య.. శాస్త్రితో కలసి కుట్రపన్ని ఆమెని 'బసివి'గా మార్చి ఓ బిడ్డకు తల్లిని చేస్తాడు. అంతటితో ఊరుకోక తన అవసరాలకోసం అధికారులకు తార్చబోతాడు. తప్పించుకొచ్చిన ఆమెపై హత్యాయత్నం చేయిస్తాడు. బిడ్డను తల్లిదండ్రులకు వదిలేసి ఊరుమారిన ఆమెకు పొలం పనుల్లో పరిచయమవుతాడు మణి. ఆ తమిళ వలసకూలీతో కలిసి రైలెక్కుతుంది. కన్నమ్మ అని పేరు మార్చుకుని అతని భార్యగా అక్కడికి వెళ్ళిపోతుంది.

మణికి అదివరకే పెళ్లయింది. ఆ మొదటి భార్య పేరు అలివేలు. ఆమెతో అవమానం, ఆపై కులవివక్ష కూడా కన్నమ్మకు ఎదురవుతాయి. మణి నిరాదరణకు గురై అక్కణ్ణుంచి వెళ్లిపోతుంది. ఐస్ ఫ్రూట్స్ అమ్ముకుని బతికే సలీం మాయమాటలకు లొంగి అతని ఇంటికి చేరుతుంది. తనే ఉర్దూ నేర్పించి, హసీనాగా ఆమె పేరు మారుస్తాడు. కువైట్ అంటూ తీసుకెళ్ళి బొంబాయిలోని వేశ్యాగృహానికి అమ్మేస్తాడు. ఏళ్లు గడుస్తాయి. తనలాగే మోసపోయి అదే గృహానికి చేరిన విజయ అనే తెలుగు అమ్మాయిని ఆమె చేరదీస్తుంది. కాపలాగా ఉన్న రౌడీ షేర్‌ఖాన్‌ను ఉపయోగించి విజయతోపాటు తానూ తప్పించుకుంటుంది. గుడిసెకి చేరుకుని తన కన్నీటికథనే ఓబులవ్వకు వినిపిస్తుంది. అప్పటి ఆ కోటమ్మే ఇప్పుడీ హసీనా. తర్వాత కథ మొత్తాన్నీ తనే నడుపుతుంది.

చిన్నప్పుడే తను వదిలివెళ్లిన కూతురు ఏమైంది? అది తెలుసుకోవడానికే తిరిగి వచ్చిందామె. అయితే ఆమె కూతుర్ని 'ఊరిబాగు' పేరిట బసివినిగా మార్చాలని కొందరు సిద్ధమవుతారు. రంగంలోకి దిగిన కోటమ్మ ఆపల్లె ఆడవాళ్ళలో నిశ్శబ్ద విప్లవాన్ని తెస్తుంది. కోరుకున్న అబ్బాయితోనే కూతురుకి పెళ్లి జరిపిస్తుంది. దురంతానికి అలా అడ్డుకట్టవేసిన ఆమె తన 'మైల జీవితం' కూతురిపై పడకూడదని రాత్రికి రాత్రే ఊరొదిలి చీకట్లో కలిసిపోతుంది. మర్నాడు తెల్లవారుజామునే ఓబులవ్వ శవంగా మారిపోతుంది. హసీనాగా వచ్చి కోటమ్మ యిచ్చిన వందనోటు ఆ ముదుసలి చేతిలో రెపరెపలాడుతుంటుంది. ఇదీ నవల సారాంశం.

ఆద్యంతం ఆసక్తికరం

'ముద్ర'లో కథాగమనం తొలినుంచీ ఆసక్తికరమే. కోటమ్మకంటే ముందే పన్నెండేళ్ల బుడ్డమ్మను ఊళ్లో బసివినిగా మారుస్తారు. 'కన్నెరికం' చేస్తాడు ముసలయ్య. కొందరు మగవాళ్ళు ఆమెను పువ్వులా నలిపేసి, చంపేసి, శవాన్ని చింతలతోపులో వేలాడదీసి ఆత్మహత్యగా నిరూపిస్తారు! ఇదంతా చదువుతుంటేనే గుండె చెదిరిపోతుంది. మరి రెండు కీలక పాత్రలు.. మూగగా కోటమ్మను ఆరాధించే కిష్టయ్య, తాగుబోతు 'గుండెకాయలోడు'. వందనోటును చేతిలో పట్టుకుని ఓబులవ్వ చనిపోవడం ఇంకో ఘట్టం. సమాజంలోని అన్ని దురాచారాలు, దయనీయ పరిణామాలకు డబ్బే మూలమనేది దీంతో ప్రస్ఫుటమవుతుంది. పాత్రానుగుణంగా వాడిన చిత్తూరు మాండలికం, తెలుగు- తమిళభాషల కలబోత యాసలూ చదువరుల్ని ఆకట్టుకుంటాయి. త్వరలో తమిళంలోకీ ఈ నవల అనువాదం కాబోతోంది మరి.

సేకరణ: *శరత్‌బాబు*

మరో ముద్రణ

కన్నడదేశంలోనూ 'ముద్ర' అనువాద నవల 'జోగతి'కు ఎంతో ఆదరణ లభిస్తోంది. పేరున్న కన్నడ నవలలతో సమంగా, ఇదీ ఇక్కడ చాలా మందిని చదివించింది, ఇంకా ఇంకా చదివిస్తోంది. రచయిత రాసాని, అనువాదకుడు రాజన్న తగ్గి ఎంత ఆనందిస్తున్నారో ప్రచురణకర్తగా నాకూ అంతే సంతృప్తి, అంతే సంతోషం. ఏడాది గడవకముందే ఇప్పుడిక రెండో ముద్రణకు సిద్ధమవుతున్నా.

–ఎం. భైరేగౌడ,
బెంగళూరు, ముద్రాపకుడు

చెంప దెబ్బ

పురుషాధిపత్య సమాజంపైన ఎక్కుపెట్టిన బాణం.. ఈ నవల. జోగినీ దురాచారానికి ఇదో చెంపదెబ్బ. కొన్ని కులాల్లో ఎప్పటినుంచో ఉన్న ఓ అనాచారాన్ని తీసుకుని ప్రతిభావంతంగా రాసిన నవలా రచయిత రాసాని అభినందనీయులు. ఇతివృత్తం ఎంతో అరుదైంది కావడంతో, కన్నడంలోనూ పేరు సంపాదించి పెట్టింది. ఆయనను కన్నడిగులకు దగ్గర చేసింది.

– డాక్టర్ దొడ్డ రంగేగౌడ,
సినీ రచయిత, 'జోగతి' ఆవిష్కర్త

కృషి ఫలించింది

ఇంత మంచి నవలను కన్నడంలోకి అనువదించినందుకు ఆనందంతో తబ్బిబ్బవుతున్నా. సమస్య తీవ్రతను పాఠకుల ముందుకు తెచ్చినందుకు సంతోషిస్తున్నా. మొదట ఇది 'చతుర'లో వచ్చినప్పుడు, చదివినంతసేపూ చలించిపోయాను నేను. కొందరి కారణంగా బసివినులుగా మారిన కోటమ్మ, బుడ్డమ్మల స్థితికి ఎంత తల్లడిల్లిపోయానో! రాసాని ఎవరో అప్పట్లో నాకు తెలియకున్నా, నవలానువాదం సాగించాను. తదుపరి స్పందన చూస్తుంటే, నాటి నా కృషి వృథాపోలేదనే అన్పిస్తోంది.

–డాక్టర్ టి.డి. రాజన్న తగ్గి
'ముద్ర' అనువాదకులు